క్లుప్తంగా

చిప్స్ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు



గుంటూరు రూరల్: క్వాలిటీ బై డిజైన్ ఏ రోడ్ మ్యాప్ ఫర్ క్వాలిటీ ఫార్మాస్యూటికల్ ప్రోడక్ట్ అనే శీర్షిక పేరుతో నవంబర్ 17, 18 తేదీలలో రెండు రోజులపాటు అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నట్లు చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ విద్యాధర్ తెలిపారు. సోమవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సదస్సులో భాగంగా నిర్వహించే శిక్షణకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను కెనడాలోని టోరెంటోకు చెందిన ఏసీడీ ల్యాబ్స్ అందిస్తుందన్నారు. ప్రస్తుత ఫార్మా రంగంలో ఔషధ అభివృద్ధి ప్రతి దశలోనూ ఉత్పత్తి నాణ్యత సమర్థత, ఆవిష్కరణలను నిర్ధారించ డానికి డిజైన్ ద్వారా నాణ్యత అనేది ఒక ముఖ్యమైన ప్రక్రియగా మారిందన్నారు. దీనిని ఆంగ్ల పరిభాషలో క్యూబీడీగా వ్యవహరిస్తార న్నారు. సదస్సు ద్వారా విద్యార్థులు ఆచరణాత్మక నైపుణ్యాలు ఫార్మా రంగంలోని తాజా పోకడలపై జ్ఞానాన్ని అందులో ఎదురయ్యే సవాళ్లను ఏకకాలంలో తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, కోశాధికారి ఆర్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లోనూ చదవడం మాకిష్టం



పెదకాకాని: ప్రతి విద్యార్థి గ్రంథాలయానికి వెళ్ళి చదువుకోవడం ద్వారా చదవడం, రాయడం బాగా నేర్చుకోవచ్చని గ్రామ సర్పంచి గోళ్ళ స్వరూపరాణి అన్నారు. పెదకాకాని లూథర్‌గిరికాలనీలోని గ్రంథాలయంలో దసరా సెలవులను సద్వినియోగం చేసుకునేలా చదవడం మాకిష్టం కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రంథాలయాధికారి వేముల విజయ్ కుమార్ పర్యవేక్షణలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి కథలు చెప్పడం, పుస్తకాలు చదివించడం జరిగింది. అలానే పుస్తక సమీక్ష, కథలలోని సారాంశాన్ని ప్రశ్నల రూపంలో అడిగారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ లింగంగుంట సాహిత్య ఏఓ క్లాసులు చెప్పడం జరిగింది. అనంతరం చిన్నారులచే ఆటలు ఆడించారు.

29న నూరు బాషాల సింహగర్జన



పొన్నూరు: ఆంధ్రప్రదేశ్ నూర్ బాషా, దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 29న గుంటూరులోని ఆంధ్ర ముస్లిం కళాశాల మైదానంలో నిర్వహించనున్న సింహ గర్జన సభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ మహమ్మద్ ఖాజావలి కోరారు. సోమవారం పట్టణంలోని నిడుబ్రోలులో నిర్వహించిన సంఘ సమావేశంలో సింహ గర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. 29న మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే సభలో సంఘీయులు అందరూ పాల్గొనాలని తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు ఖాజావలి, నాగూర్ బాషా, ప్రధాన కార్యదర్శి మామిల్లపల్లి మేరావలి, వికలాంగుల జిల్లా నాయకులు అల్లాబాషా తదితరులు పాల్గొన్నారు.

వైద్యం కోసం ఆర్థిక సహాయం

గుంటూరు మెడికల్: కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్న తొమ్మిది సంవత్సరాల బాలుడికి దాతల ఆర్థిక సహాయంతో రూ.4 లక్షలు చికిత్స కోసం గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అందజేశారు. మంగళగిరి మండలం పెదవడ్లపూడికి చెందిన శృంగారపు అనీల, విజయ్ కుమార్ దంపతుల తొమ్మిది సంవత్సరాల అభినయ్‌కు ఆరోగ్యం సరిగా లేక గుంటూరులోని బ్లూమ్స్ హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం చేర్పించారు. వైద్యులు పరీక్షించి కిడ్నీ పనిచేయడం లేదని తల్లిదండ్రులకు చెప్పారు. నిరుపేదలైన అనిల దంపతుల చికిత్స చేయించేందుకు డబ్బులేక ఎదురు చూస్తున్న సమయంలో గుంటూరు కోవిడ్‌ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్‌కు సమాచారం ఇచ్చారు. స్పందించిన గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు స్పందించి బాబు తల్లిదండ్రులకు రూ.4 లక్షలు అందజేసి ట్రస్టు దాతృత్వాన్ని చాటుకున్నారు. సహాయం కోసం 8143222456-9397602553 నంబర్లకు సంప్రదించాలని గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు వెల్లడించారు.

ప్రతి ఒక్కరికి ఆరోగ్య భాగ్యం

పెదకాకానిలో 401 మందికి వైద్య సేవలు



పెదకాకాని జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పెదకాకాని: సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టారని ఎంపీపీ తుల్లి మిల్లి శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని లూథర్‌గిరి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, సర్పంచి గోళ్ళ స్వరూపరాణిలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఆశయంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి స్పెషలిస్ట్ డాక్టర్లచే వైద్య సేవలు అందించడం, ఉచితంగా మందులు పంపిణీ చేయడం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా జరుగుతుందన్నారు. బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. ఈ శిబిరం ద్వారా 401 మందికి వైద్యసేవలు అందించారు. వైద్య శిబిరం ఏర్పాట్లను జి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. కంటి పరీక్షలు నిర్వహించి కళ్ళజోళ్ళు పంపిణీ చేసేందుకు సిఫారసు చేశారు. ఈ శిబిరంలో డాక్టర్ రామాంజిరెడ్డి, డాక్టర్ పి.ప్రవీణదీప్తి, డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ వెంకటసాయి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎ.రామకృష్ణ, సూపరింటెండెంట్ బి.వి.మల్లేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు మాతంగి నిర్మల, బంగారు మరియమ్మ, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్‌హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి రాజారాం, మండల పార్టీ అధ్యక్షుడు చాగంటి మురళీమోహన్‌రెడ్డి, గోళ్ల జోసఫ్, శ్యాంముఖర్జీబాబు, ఆలపాటి రాఘవ, కృష్ణారెడ్డి, బండెల ఉదయ్‌శంకర్, షేక్ ఆరిఫ్, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఇంటి వద్దకే వైద్య సేవలు

పొన్నూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ఇంటి వద్దకే వైద్య సేవలు రావడంతో ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి భరోసా లభించిందని ఎంపీపీ బి.పద్మలీల అన్నారు. సోమవారం మండలంలోని నండూరు గ్రామం ఎంపీ యూపీ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మలీల ముఖ్యఅతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో ఏర్పాటుచేసిన పోషకాహార ప్రదర్శనను సందర్శించి ప్రజలకు చేస్తున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటి వద్దకే వైద్య సేవలు రావడం ఎంతో అదృష్టం అన్నారు. ప్రత్యేకంగా నియమించిన స్పెషలిస్టు డాక్టర్లు వైద్య పరీక్షలు చేయడంతో పాటు నాణ్యమైన మందులు ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. చికిత్స అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యశాలల్లో మెరుగైన వైద్యం అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు అపూర్వ స్పందన లభిస్తుందన్నారు. నండూరు గ్రామంలో 473 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు గుండవరం, గొడవర్రులో

మీ గుండె పదిలం ఉచిత వైద్య శిబిరం

బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ



చేబ్రోలు: బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా మీ గుండె పదిలం పేరుతో చేపట్టిన గుండె వ్యాధుల నిర్ధారణ పరీక్ష శిబిరాన్ని చేబ్రోలు మండలం గుండవరం, గొడవర్రు గ్రామాలలో బుధవారం ఏర్పాటు చేయనున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ తెలిపారు. పట్టాభిపురంలోని బజరంగ్ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలనలో ఆరోగ్యశ్రీ పథకం అద్భుతంగా పనిచేస్తోందన్నారు. ఇంటికే ఆరోగ్యం –జగనన్నతో సాకారం, ఆరోగ్యశ్రీతో ఆయుష్మాన్ భవ అంటూ ఈ విషయాన్ని స్వయంగా క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తూ, దీనిని సద్వినియోగం చేసుకునే అవగాహనను ప్రజలకు ఆచరణాత్మకంగా బజరంగ్ ఫౌండేషన్ ఈ శిబిరాల ద్వారా కల్పిస్తోందని చెప్పారు. గత నెలలో పొన్నూరు మండలం మామిళ్ళపల్లి, ఆరెమండ, దండమూడి, కట్టెంపూడి, తాళ్లపాలెం గ్రామాలలో గుండె పరీక్ష శిబిరాలను ఏర్పాటు చేసి 564 మందికి పరీక్షలు చేయడం జరిగిందన్నారు. వీరిలో అవసరమైన 75 మందికి యాంజియోగ్రామ్, సమస్య నిర్ధారణ అయిన వారిలో 8 మందికి స్టెంట్‌లు, 5 శస్త్ర చికిత్సలను దిగ్విజయంగా పూర్తి చేసినట్లు వివరించారు. విజయవాడలోని మెడ్ స్టార్ ఆసుపత్రి నుంచి నిపుణులైన వైద్య బృందాలతో గుండవరం, గొడవర్రు గ్రామాలలోనే శిబిరాన్ని, వైద్య పరీక్షలను నిర్వహించి, అనంతరం వైద్య సేవలను బజరంగ్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిందని వెల్లడించారు. ఆయా గ్రామాల ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని, వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

దేశ ప్రగతిలో భాగస్వాములుకండి

హైదరాబాద్‌లోని ఐఐసీటీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ కే భానుప్రకాష్



విజ్ఞాన్ యూనివర్సిటీలో మాట్లాడుతున్న ఐఐసీటీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ కే భానుప్రకాష్

చేబ్రోలు: దేశ ప్రగతికి దోహదపడే వినూత్న కార్యక్రమాలలో పరిశోధకులు నిమగ్నమవ్వాలని హైదరాబాద్‌లోని ఐఐసీటీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ కే భానుప్రకాష్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో హ్యాండ్స్ ఆన్ ట్రెనింగ్ యూజింగ్ ఇన్–సిలికో టూల్స్ ఫర్ కెమికల్/బయోలాజికల్ అప్లికేషన్స్ అనే అంశంపై మూడు రోజుల వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ కే భానుప్రకాష్ కంప్యూటింగ్ విధానాలు–పరమాణు అంచనాలు అనే అంశంపై మాట్లాడారు. ఈ రంగంలో ఉన్న సవాళ్లు, భవిష్యత్ పరిశోధనలకు ఉన్న అవకాశాలపై కూడా ఆయన చర్చించారు. ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ డీఎల్‌వీకే ప్రసాద్ మాట్లాడుతూ ఉత్ప్రేరకము, బయోకెమిస్ట్రీ, మెటీరియల్ సైన్స్‌తో సహా వివిధ రంగాలలో కంప్యూటేషనల్ కెమిస్ట్రీ ప్రయోజనాలను వివరించారు. రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు మార్గదర్శకులు అబ్దుల్ కలాం

ఆర్‌వీఆర్‌జేసీలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: భారత మాజీ రాష్ట్రపతి భారత రత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం యువతకు మార్గదర్శకుడని డేటా సెంటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఐటీ క్లౌడ్ ఆపరేషన్స్ డైరెక్టర్ కేవీఎస్ ప్రకాశరావు తెలిపారు. చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి వేడుకల్లో భాగంగా ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ డే వేడుకలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు పరిశోధనలు చేయాలని సమాజాభివృద్ధికి కృషిచేయాలని తెలిపారు. నిత్యం పరిశోధనలు చేయాలని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్ టెక్నాలజీ, ప్రపంచాన్ని శాసించబోతున్నాయన్నారు. ఇటీవల వరల్డ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్ జరిపిన సర్వేలో తెలిపిన నివేదిక ప్రకారం భారతదేశం ఇన్నోవేషన్ ఫలితాల్లో 40వ స్థానంలో ఉందన్నారు. రానున్న కాలంలో ఇన్నోవేషన్ స్టార్టప్‌ల విజయాల్లో భారతదేశ ర్యాంక్ ఉన్నత స్థానంలో ఉంచేందుకు విద్యార్థులు వినూత్న ఆలోచనలతో అద్భుతాలను ఆవిష్కరించాలన్నారు. ఆవిష్కర్తలను ప్రోత్సహిస్తూ వారి ఆవిష్కరణలను ఉత్పాదక స్థాయికి తీసుకెళ్లేందుకు తమ కళాశాలలో డీఎస్‌టీ స్కీం ద్వారా రూ. 5 కోట్ల నిధులతో ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఇటీవల ఏర్పాటు చేసుకోవడం గర్వకారణమని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణలు తెలిపారు. ప్రపంచ దేశాల్లోనే భారతదేశం ఆవిష్కరణలకు స్వర్ణధామంగా నిలిచే రీతిలో విద్యార్థులు తయారవ్వాలని కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాస్, ఈఎమ్‌డీ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖర్, ఐపీ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ నాగమల్లేశ్వరరావు, డాక్టర్ కె.కార్తీకపవన్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కోసం వెళితే రౌడీషీటా?!

జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన మహిళ

చేబ్రోలు: ముగ్గురు యువకులు మద్యం మత్తులో దాడి చేసి గాయపరిచారని న్యాయం చేసి రక్షణ కల్పించాలని పోలీసు స్టేషన్‌కు వెళితే ఎస్ఐ రౌడీషీట్ ఓపెన్ చేస్తానని బెదిరిస్తున్నారని ఓ మహిళ జిల్లా ఎస్పీకి సోమవారం స్పందనలో ఫిర్యాదు చేసింది. జరిగిన ఘటనలను విలేకర్లకు తెలియజేసింది. చేబ్రోలు ప్రాంతానికి చెందిన వేల్పూరి దుర్గ విజయవాడకు చెందిన యువకుడిని ప్రేమ వివాహం చేసుకుంది. బతుకు తెరువు కోసం విజయవాడలోని రాజరాజేశ్వరిపేటలో నివాసం ఉంటున్నారు. ఈ నెల 1వ తేదీ దుర్గ అత్త రూతమ్మ చేబ్రోలు చెరువులోపాలెంకు వెళ్లింది. మద్యం మత్తులో ఉన్న వినోద్, నవీన్, వీరేంద్ర అనే ముగ్గురు యువకులు రూతమ్మ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి గాయపరిచారు. దీనిపై దుర్గ, అతని భర్త విచారించటానికి వెళ్లగా వారితో పాటు సుజాత, విజయరాణి, ప్రశాంతి, రాజేంద్ర, రాజశేఖర్, మరియదాసు తదితరులు ఘర్షణ పెట్టుకొని కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుసుకున్న వారు కొట్టి తీవ్రంగా గాయపరిచారు. ఘటనపై దిశా పోలీసులకు ఫిర్యాదు చేయటం జరిగింది. స్థానిక ఎస్ఐ కె.ఆనంద్ యువకులపై చర్యలు తీసుకోకపోగా భార్యాభర్తలను బెల్టుతో కొట్టి బూతులు తిట్టినట్లు ఆమె తెలిపింది. నా మీదే దిశ పోలీసులకు ఫిర్యాదు చేస్తావా అంటూ నీ మీద, నీ భర్త మీద ఇంకా కేసులు పెట్టి, నీ భర్తపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తానని ఎస్ఐ ఆనంద్ బెదిరిస్తున్నట్లు ఎస్పీకి ఆమె ఫిర్యాదు చేసింది. ఈ అవమానాన్ని తట్టుకోలేక ఆత్మహత్యాయత్నంకు పాల్పడినట్లు వేల్పూరి దుర్గ తెలిపింది.

కరాటే టోర్నమెంట్‌లో సత్తా చాటిన విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: బృందావన్‌గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం జరిగిన మాస్టర్ అసాయి మెమోరియల్ 2వ అంతర్జాతీయ కరాటే పోటీల్లో హిడెన్‌స్టార్స్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల డైరెక్టర్ ఎస్. శ్యామల సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్–8 విభాగంలో జాహ్నవి, జాయ్ విన్నీ ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లు తెలిపారు. అండర్–10 బాలికల విభాగంలో షణ్ముఖి తృతీయ, బాలుర విభాగంలో రుషిక్‌రెడ్డి, పవన్ శ్రీకర్ రెడ్డి, సాయి మానీష్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లు వివరించారు. అదే విధంగా అండర్–12 విభాగంలో విరంచ్ ప్రథమస్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులతో పాటు అకడమిక్ ఫెసిలిటేటర్ ఎస్.హేమలత, కోచ్‌లు ఎ. రవికుమార్, లక్ష్మీప్రసన్నకు అభినందనలు తెలియజేశారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం భద్రం

సామాజిక విజ్ఞాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చైతన్యకుమారి



మిల్లెట్ మారథాన్‌ను ప్రారంభిస్తున్న కళాశాల అధికారులు

గుంటూరు రూరల్: చిరుధాన్యాలతో ఆరోగ్యాన్ని భద్రంగా కాపాడుకోవచ్చని సామాజిక విజ్ఞాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం ఎస్ చైతన్యకుమారి తెలిపారు. సోమవారం కళాశాల దత్తత గ్రామం నిడుముక్కలలో ప్రపంచ ఆహార దినోత్సవంలో భాగంగా జలమే జీవం, జలమే ఆహారం నినాదంతో పలు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఆహార దినోత్సవం గురించి వివరించారు. రాగులు, సజ్జలు, అరికలు, ఊదలతో పోషక విలువలు కలిగిన శరీరాన్ని తయారు చేసుకోవచ్చన్నారు. అనంతరం మిల్లెట్ మారథాన్‌ను రెండు కిలోమీటర్ల దూరం నిర్వహించారు. చిరుధాన్యాలను అనుదినం ఆహారంలో చేర్చుకోవటం ద్వారా అనేక రోగాలకు చెక్‌పెట్టవచ్చన్నారు. చిరుధాన్యాలను తక్కువ నీటి వినియోగంతో ఏవిధంగా సాగు చేయాలి వివరించారు. గ్రామంలోని ప్రజలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి డి.కిరణ్మయిదేవిరెడ్డి మిల్లెట్ మారథాన్‌లో విజేతలు కోటేశ్వరరావు, కె.లక్ష్మీదీప్, షేక్ మెహఫీస్‌లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.నిర్మలదేవి, డాక్టర్ కె.ధనశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి



మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాల నియంత్రణపై మానవహారం

చేబ్రోలు: మండల కేంద్రమైన చేబ్రోలులో బాల్య వివాహాల నియంత్రణపై ర్యాలీ, అవగాహన కార్యక్రమం స్వయం సహాయక సంఘాల సభ్యులు, అంగనవాడీ కార్యకర్తలతో సోమవారం నిర్వహించారు. బాల్య వివాహాల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి వరకు కొవ్వొత్తులతో ర్యాలీ జరిగింది. మానవహారం నిర్వహించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో బి.బాబురావు, ఏపీఎం వి.నాగేశ్వరరావులు మాట్లాడుతూ బాల్యవివాహాలు చేసినా, ప్రోత్సహించి సహకరించిన వారికి రూ.లక్ష జరిమానాతో పాటు రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష ఉంటుందని తెలిపారు. బాల్య వివాహ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దటానికి మహిళా సంఘాలు, డ్వాక్రా సంఘ సభ్యులకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. నిరక్షరాస్యత, పేదరికం బాల్య వివాహాలకు ప్రధాన కారణాలన్నారు. ఆడపిల్ల అనగానే ఒక బరువుగా, భారంగా భావించడం అవగాహన రాహిత్యంతో చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేయడం జరుగుతున్నట్లు తెలిపారు. చేబ్రోలు మండలం బాల్య రహిత వివాహ మండలంగా తయారవ్వాలని ప్రతి ఒక్క మహిళ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డ్వాక్రా సంఘ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పుకు వినతిపత్రం



పెదకాకాని తహసీల్దార్ పి.రత్నంకు వినతిపత్రం అందజేస్తున్న కొప్పురావూరు వాసులు

పెదకాకాని: రైల్వేగేటు ఎల్‌సీ 7 వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నుంచి గ్రామంలోకి వెళ్లే రోడ్డును అధికారులు ఇచ్చిన హామీ ప్రకారం వెడల్పు వేయాలని కొప్పురావూరు వాసులు సోమవారం అధికారులను కలసి వినతి పత్రం సమర్పించారు. పెదకాకాని మండలంలోని కొప్పురావూరు గ్రామంలోకి జాతీయ రహదారి నుంచి వెళ్లే మార్గంలో రైల్వేగేటు ఎల్‌సీ 6, ఎల్‌సీ 7 ఉన్నాయి. ఈ గేట్లను తొలగించి అండర్‌పాస్ బ్రిడ్జి, అప్రోచ్‌రోడ్డు వేసేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ పనుల్లో భాగంగా గ్రామ ప్రజలతో అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అధికారులు ఎల్‌సీ 6 అండర్‌పాస్ బ్రిడ్జి 6 మీటర్ల వెడల్పు, 9 మీటర్లు వెడల్పుతో అప్రోచ్‌రోడ్డు ఏర్పాటు చేశారు. గత కొంతకాలంగా ఎల్‌సీ 7 పనులు చేపట్టారు అండర్‌పాస్ బ్రిడ్జి 6 మీటర్లు వెడల్పుతో నిర్మించిన అధికారులు 5 మీటర్ల వెడల్పుతో అప్రోచ్ రోడ్డు వేస్తున్నారు. ఇప్పటికే ట్రాఫిక్ రద్దీ పెరిగిందని, భవిష్యత్తు ట్రాఫిక్ అవసరాల దృష్ట్యా ఎల్‌సీ 7 వద్ద కూడా 9 మీటర్ల వెడల్పుతో అప్రోచ్ రోడ్డు వేయాలని గ్రామ ప్రజలు అధికారులను కలసి వినతిపత్రం అందజేశారు. ఇరుకు రోడ్డు ఏర్పాటు చేయడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి గ్రామస్తులతో సమావేశంలో ఇచ్చిన మాట ప్రకారం ఎల్‌సీ 7 వద్ద కూడా 9 మీటర్లు అప్రోచ్‌రోడ్డు వేయాలని వారు కోరారు. రైల్వే అధికారులను, తహసీల్దార్ రత్నంను కలసి వినతి పత్రం అందజేశారు. అధికారులను కలసిన వారిలో సర్పంచి ఆలా సాంబశివరావు, మాజీ సర్పంచి విన్నకోట పూర్ణశంకరరావు, సుమారు 100 మంది గ్రామ పెద్దలు ఉన్నారు.

గాయత్రీదేవిగా భ్రమరాంబ అమ్మవారు

భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న శరన్నవరాత్రులు



పెదకాకాని శివాలయంలో గాయత్రీదేవిగా భ్రమరాంబ అమ్మవారు

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో భక్తి శ్రద్ధలతో దసరా నవరాత్రోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. పెదకాకాని శివాలయంలో ఉత్సవాలలో రెండవరోజు భ్రమరాంబ అమ్మవారు శ్రీ గాయత్రీ దేవిగా భక్తులను అనుగ్రహించారు. ఉత్సవాలలో భాగంగా తెల్లవారు జామున 5 గంటలకు సుప్రభాతసేవ, హారతులతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 10 గంటలకు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనము, పంచగవ్యం, నవావరణ జరిగాయి. అర్చకస్వాములు ఉభయదాతలచే పూజలు నిర్వహింపచేశారు. సాయంత్రం 5 గంటలకు భ్రమరాంబ అమ్మవారికి కుంకుమార్చనలు, 6 గంటలకు హారతులు, ఆలయ ప్రదక్షిణ, తీర్థ ప్రసాదాల వితరణ జరిగింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా భజన, కూచిపూడి నృత్యం, సత్య హరిశ్చంద్ర నాటకంలో అడవిసీను, వారణాసి, కాటిసీను ప్రేక్షకులను అలరింపజేశాయి.

నేడు అన్నపూర్ణాదేవిగా భ్రమరాంబ అమ్మవారు..

దసరా ఉత్సవాలలో భాగంగా మూడవరోజు మంగళవారం భ్రమరాంబ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులను అనుగ్రహిస్తారు. సాయంత్రం 5:30 గంటలకు భక్తిరంజని, 6:30 గంటలకు భజన, 8:30 గంటలకు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి చరిత్ర పూర్తి నాటకం ప్రదర్శింపబడుతుందని నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలియజేశారు.

ట్రాఫిక్ సీఐగా కోటేశ్వరరావు

పట్నంబజారు: గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ సీఐగా బి.కోటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2002 బ్యాచ్ ఎస్సైగా పోలీసు విధుల్లోకి వచ్చిన ఆయన గుంటూరుతోపాటు పలు ప్రాంతాల్లో పనిచేశారు. అనంతరం 2012లో ఆయనకు సీఐగా పదోన్నతి లభించింది. సీఐగా గురజాల, సత్తెనపల్లి, నరసరావుపేట, గుంటూరు నగరంపాలెం, తెనాలి–2 టౌన్ పోలీసు స్టేషన్ సీఐగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న కోటేశ్వరరావును ట్రాఫిక్ సీఐగా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు



మెనోపాజ్ అవగాహన పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ నీలం ప్రభావతి

గుంటూరు మెడికల్: కార్పొరేట్ వైద్యాన్ని పేదలకు అందించాలనే లక్ష్యంతో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నా మని హోప్ విన్ హాస్పిటల్ ఫౌండర్, సీనియర్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్ చెప్పారు. హోప్‌విన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మహిళలకు మెనోపాజ్ క్లినిక్‌ను జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ ఐదేళ్లుగా గుంటూరులో ప్రత్యేక క్లినిక్, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న హోప్ విన్ హాస్పిటల్స్‌కు అభినందనలు తెలిపారు. సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ మహిళలకు రుతు సంబంధిత వ్యాధులు ముందస్తుగా గుర్తించేందుకు, రుతుక్రమం అనంతరం జరిగే సమస్యలకు చెక్ పెడుతూ మహిళల కోసం ప్రత్యేక క్లినిక్ ప్రారంభిస్తున్నామన్నారు. మహిళలకు ప్రత్యేక వైద్య సేవలు తమ ఆస్పత్రిలో అందిస్తున్నామన్నారు. రక్త పరీక్షల్లో 50 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. డాక్టర్ విజయ ప్రకాష్, డాక్టర్ ఖాజా, డాక్టర్ రాహుల్ రెడ్డి పాల్గొన్నారు.

అదృశ్యంపై కేసు నమోదు

పెదకాకాని: సండే స్కూల్‌కు కుమారుని వెంట బెట్టుకుని వెళ్ళిన మహిళ ఇంటికి రాకపోవడంతో భర్త పోలీసులను ఆశ్రయించిన ఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పెదకాకాని గ్రామానికి చెందిన బురదగుంట విజయకుమార్, కెజియా దంపతులకు మూడేళ్ళ ఆనంద్‌పాల్ సంతానం. కెజియా కుమారునితో కలసి ప్రతి ఆదివారం సండే స్కూల్‌కు వెళ్ళి వస్తూ ఉంటుంది. ఈనెల 15వ తేదీన సండే స్కూల్‌కు వెళ్ళి ఇంటికి రాలేదు. పరిసర ప్రాంతాలలో వెతకడంతో పాటు బంధువులకు సమాచారం అందించినా ఎటువంటి ఆచూకీ లభించలేదు. సండే స్కూల్‌కు వెళ్ళిన భార్య, కుమారుడు కనిపించకపోవడంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తల్లి, కుమారుడు అదృశ్యం కావడంపై ఆదివారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.